ప్రజాశక్తి

సోమవారం 30 అక్టోబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ఉక్కును ప్రైవేటుపరం కానివ్వం

- ప్రభుత్వ రంగ పరిరక్షణ అజెండాగా 2024 ఎన్నికలను ప్రభావితం చేయాలి
- సరళీకరణ విధానాలను ఓడించే ప్రజాపోరాటానికి కార్మికులు సిద్ధం కావాలి
- 'స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల రక్షణ' రాష్ట్ర సదస్సులో వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, వేదికపై శోభనాద్రీశ్వరరావు, శర్మ, జగ్గునాయుడు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వబోమని పలువురు వక్తలు స్పష్టం చేశారు. విశాఖలోని డాబాగార్డెన్స్ దరి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన ఆదివారం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకై సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ మంత్రి, కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ద్రవిడ యూనివర్సిటీ పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ కెఎస్.చలం హాజరై మాట్లాడారు. ప్రజల సంపదైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు బిజెపి పాలనలో తీవ్ర ప్రమాదం ఏర్పడిందంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ 'ప్రభుత్వ ఆస్తులు ఒకసారి చేజారితే వెనక్కి రావు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కుట్రలు కొనసాగుతున్నాయి. 2022 నవంబర్ 11న 'ఉక్కు'పై బిజెపి ప్రభుత్వం వేసిన వేల్యుయేషన్ కమిటీని కార్మికులు అడుగుపెట్టనివ్వలేదు. 990 రోజులుగా ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా నిలువరించగలిగాం' అని అన్నారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో కేవలం 1200 మంది ఉద్యోగులే ఉన్నప్పటికీ నాడు ప్రైవేటీకరణను అడ్డుకునేలా వారిలో సిఐటియు, సిపిఎం, వామపక్షాలు చైతన్యం కలిగించాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలను ఎలా అడ్డుకుంటున్నదీ వివరించారు. విశాఖకు గల ప్రత్యేకతలను బట్టి పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ఎన్ఎఒబి రాంబిల్లిలో రూ.2 లక్షల కోట్లతో తయారవుతోందని అన్నారు. దేశంలో 1.5 లక్షల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంటే విశాఖలోని ఎన్‌టిపిసిలో 70 వేల మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ రంగంలో ఉన్న దీనిపై కేంద్ర పాలకులు కుట్రలు సాగిస్తున్నారని, మిగతా 2లో..

వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముగిసిన ఎఎంసి శతాబ్ది ఉత్సవాలు

ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 27న ప్రారంభమైన ఈ వేడుకలకు ఉప రాష్ట్రపతి, గవర్నర్ ప్రభృతులు హాజరైన విషయం తెలిసిందే. ఆదివారం ఆటపాటలతో పూర్వ విద్యార్థులు, డాక్టర్లు సందడి చేశారు.

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన

▸ వార్త 4లో..

మహా పడావ్‌ను విజయవంతం చేయండి

▸ వార్త 8లో..

692వ రోజుకు మత్స్యకారుల ధర్నా

▸ వార్త 8లో..

విశాఖలో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి గంటా తదితరులు

కళ్లకు గంతలతో నిరసన

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి నేతలు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. బాబు అరెస్టు కక్షపూరితంగానే జరిగిందంటూ పెద్దపెట్టున నినదించారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు.. ఇంకొన్ని దారి మళ్లింపు

విజయనగరం జిల్లా అలమండ వద్ద ప్రమాదంతో రైల్వే అప్రమత్తం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆదివారం రాత్రి 7.15 గంటల సమయంలో విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి - అలమండ మధ్యలో పలాస పాసింజర్‌ను రాయగడ ఎక్స్‌ప్రెస్ ఢీకొని మూడు బోగీలు విరిగిపడిన ఘటనతో వాల్తేరు రైల్వే పరిధిలో పలు రైళ్లు రద్దు, ఇంకొన్ని దారిమళ్లింపు చర్యలను రైల్వే చేపట్టింది. ఆదివారం రాత్రి 11.15 గంటలకు రైల్వే శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాయపూర్ - విశాఖపట్నం పాసింజర్ (08527) ఈ నెల 30న రాయపూర్‌లో బయల్దేరాల్సి ఉండగా రైలు రద్దయ్యింది. విశాఖ నుంచి రాయపూర్ పాసింజర్ (08528)ను కూడా రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

టిట్లాగర్-రాయపూర్-నాగ్‌పూర్ -విజయవాడ రెగ్యులర్‌గా తిరిగే రైలును దారిమళ్లించారు. బారుని - కోయంబత్తూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (03357)ను వేరే రూట్‌కి దారిమళ్లించారు. రైలు నెంబరు (18189) టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ 29న తిరగాల్సిన దాన్ని రూట్ మళ్లించారు. ట్రైన్ నెంబరు 11020 భువనేశ్వర్ - సిఎస్‌టి ముంబయి-కోణార్క్ ఎక్స్‌ప్రెస్ భువనేశ్వర్‌లో 29న బయల్దేరాల్సి ఉండగా దారిమళ్లించారు. రైలు నెంబరు 12703 హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ హౌరాలో 29న బయల్దేరాల్సి ఉండగా దీన్ని దారిమళ్లించారు. రైలు నెంబరు 12245 హౌరా - బెంగళూరు దురంతో ఎక్స్‌ప్రెస్ 29న హౌరాలో బయలుదేరాల్సి ఉండగా దాన్ని దారి మళ్లించారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

రైళ్ల షార్ట్ టెర్మినేషన్

రైలు నెంబరు 20809 సంబల్‌పూర్-నాందేడ్ రైలు సంబల్‌పూర్‌లో 29న బయల్దేరింది. దీన్ని విజయనగరంలో ఆపేశారు. విజయనగరం - సంబలపూర్‌కు దీన్ని నడుపుతారు. రైలు నెంబరు 17479 పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ పూరీలో ఈ నెల 29న బాలుగాన్‌లో నిలుపుదల చేశారు. పూరికి ఇది రావాల్సి ఉంది. విశాఖ పట్నం-విజయనగరం ట్రైన్ విశాఖలో ఆదివారం బయదేరాల్సి ఉండగా దాన్ని పెందుర్తిలో ఆపేశారు. రైలు నెంబరు 11020 సిఎస్‌టి ముంబయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ సిఎస్‌టి ముంబయిలో 28న ప్రారంభం అయ్యింది. విశాఖపట్నంలో దీన్ని నిలిపివేశారు.

మొదటి పేజీ తరువాయి..

ఉక్కును ప్రైవేటుపరం కానివ్వం

ఇప్పటికే 49 శాతం మేర ప్రైవేటీకరణ అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ప్రభుత్వ రంగానికి నిలయంగా ఉండేదని, కానీ తాజా లెక్కలు చూస్తే బిహెచ్‌పివిని ఎల్‌అండ్‌టి ఆక్రమించడం వల్ల నాలుగు వేల మంది ఉద్యోగులకుగాను నాలుగు వందలకు, పోర్టులో పిపిపి వల్ల తొమ్మిది వేల మందికిగాను మూడు వేలకు, షిప్‌యార్డులో ఏడు వేల నుంచి 700 మందికి కార్మికుల కుదింపు జరిగిందన్నారు.

నయా ఉదారవాద విధానాలు ప్రమాదకరం : ఎంవిఎస్.శర్మ

సరళీకరణ విధానాలను ఓడించేందుకు జరిగే అన్ని పోరాటాల్లోనూ కార్మికవర్గం భాగం కావాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. నయా ఉదారవాద విధానాలు ఎంతటి ప్రమాదకరమో వివరించారు. విద్య, వైద్యం నేడు ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని, ఉపాధి హామీకి దేశంలో నిధులు తగ్గిపోయాయని, సరళీకరణ విధానాలే వీటికి కారణమని అన్నారు. నవంబర్ 9కి స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ఆరంభమై వెయ్యి రోజులు కావొస్తోందని.. ఈ క్రమంలో రానున్న ఆరు నెలల ఎన్నికల కాలంలో కార్మికులు 'ప్రభుత్వ రంగ పరిరక్షణ'ను పార్టీల అజెండాగా మార్చే దిశగా పని చేయాల్సి ఉందని అన్నారు. సాంస్కృతిక రంగంలో కృషి పెరగాల్సి ఉందన్నారు. కళారూపాలు, ఆటపాటల ద్వారా ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలన్నారు.

ప్రభుత్వాల ప్రోత్సాహం కరువైంది : ఎ.బాలాజీ

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు గడ్డుకాలం ఎదురైందని, ప్రభుత్వ ప్రోత్సాహం పూర్తిగా కరువైందని చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.బాలాజీ అన్నారు. ఉత్పత్తి, రా ఖర్చులు, రా మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దీంతో చిన్న పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతులు పూర్తిగా దెబ్బతింటున్నాయని తెలిపారు. చైనాతో పోటీ పడాలని చెప్పే పాలకులు ఆచరణలో ఈ పరిశ్రమలను బతకనివ్వడం లేదన్నారు. విశాఖ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఇప్పటికే మూతపడిందని, ఆటోనగర్‌లో 1200 ఎకరాల్లో ప్రభుత్వం చిన్న మధ్య పరిశ్రమల కోసం స్థలాలు ఇవ్వగా 900 యూనిట్ల నుంచి 2000 యూనిట్లకు సంఖ్య చేరినా ప్రస్తుత పరిస్థితులతో మూతపడుతున్నాయన్నారు. మూడేళ్లుగా అనేక యూనిట్లు గోదాములుగానూ, సేవా కేంద్రాలుగానూ మారిపోయాయన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థ అయిన భెల్ బలహీనపడడంతో 40-50 చిన్న పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. విశాఖ ఆర్థిక వ్యవస్థకు 30 శాతం ఆధారమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పట్ల పాలకుల వైఖరి తీవ్ర బాధ కలిగిస్తోందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు పోరాటాలకు స్టీల్ కార్మికులు ఇంటింటికీ వెళ్లే కార్యాచరణ రూపొందించాలని పిలుపునిచ్చారు. నవంబర్ 3న పెందుర్తిలోకి సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్ర ప్రవేశిస్తుందని, అనంతరం జిల్లాలో కొనసాగుతుందని, అన్నిచోట్లా యాత్రను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

డయాబెటిస్‌పై అవగాహన అవసరం

అవగాహన కార్యక్రమంలో బృందం సభ్యులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సెంటర్ ఫర్ ఎండోక్రనాలజీ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్ గోళ్ల, అవ్యాన్ స్కిన్ హెయిర్ అండ్ లేసర్ క్లినిక్ వైద్యురాలు ఎర్రోజు శ్వేతా మాధవి సంయుక్తంగా ప్రపంచ డయాబెటిస్ డేను పురస్కరించుకుని డయాబెటిస్ కేర్ ఇన్ స్పోర్ట్స్ అండ్ ఎక్సర్‌సైజెస్ పేరిట ఆదివారం ఉదయం నగరంలోని పోర్టు స్టేడియంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. డయాబెటిస్ వ్యాధిగ్రస్తులలో మానసిక ఉల్లాసాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ డయాబెటిస్ వ్యాధి నియంత్రణకు అవగాహన ఎంతైనా అవసరమన్నారు. టైప్ వన్ డయాబెటిస్ వ్యాధిగ్రస్తులలో అవగాహన పెంపొందించేందుకు ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించామని తెలిపారు. ఎర్రోజు శ్వేతా మాధవి మాట్లాడుతూ రోగులకు తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కాశీ విశ్వనాథ్, మైరా మీడియా ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి ఉదయ్ కొల్లి, వంద మందికిపైగా డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పేదలకు సేవ చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటానని నగరంలోని 18వ వార్డు వైసిపి నాయకులు పుక్కళ్ల శంకర్ తెలిపారు. ఆదివారం ఎంవిపి కాలనీలోని అప్పుఘర్ రోడ్డులో ఉన్న పార్టీ వార్డు కార్యాలయంలో జరిగిన తన జన్మదిన వేడుకల్లో ఆయన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవ చేయడంలో అంతులేని సంతృప్తిదాగి ఉందన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

స్కేటింగ్ క్రీడాకారులకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఇంటర్ క్లబ్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ కమ్ సెలక్షన్ ట్రయల్స్ - 2023ని ఈ నెల 13 నుంచి 19 వరకు క్యాడెట్, సబ్-జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించగా పలువురు ప్రతిభ కనబరిచారు. 800 మందికిపైగా స్కేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో వివిధ విభాగాల్లోని విజేతలకు విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర చేతులమీదుగా పతకాలు అందజేసి సత్కరించారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోశాధికారి డాక్టర్ బాగిరథ కుమార్, విశాఖపట్నం డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వై.రమేష్ చంద్ర, ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో దృశ్యాలు

హెల్ప్‌లైన్ సెంటర్ వద్ద ఆరా తీస్తున్న ప్రయాణికులు

రైళ్లు రద్దుతో ప్రయాణికుల పడిగాపులు

ప్రమాదం నేపథ్యంలో రైళ్లు లేక బోసిపోయిన రైల్వేస్టేషన్

వైద్యసేవలకు తరలివెళ్లేందుకు సిద్ధపడుతున్న వైద్యుల బృందం

విజయనగరం జిల్లా అలమండ వద్ద జరిగిన రైలు ప్రమాదం నేపథ్యంలో విశాఖ స్టేషన్‌లో రైల్వే సిబ్బంది అప్రమత్తమయ్యారు. పలు రైళ్లను నిలిపివేశారు. హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు.

30 నుంచి ఫుడ్ ప్రాసెసింగ్‌లో సర్టిఫికెట్ కోర్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌ఎపిసిసిఐ) ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సును పది రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ కోర్సుపై అక్టోబర్ 30 నుంచి నవంబర్ 9 వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిక్షణ ఉంటుందని సంస్థ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, వినియోగదారుల పరిశ్రమ, వ్యవసాయం మధ్య సమన్వయాన్ని తీసుకువచ్చే విధంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపించడం కోసం .ఆ రంగంలో ఉన్న అనేక రకాల అవకాశాలను తెలిపేందుకు ఎంఎస్ఎంఇ రంగం ద్వారా శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మరింత లోతైన జ్ఞానాన్ని అందించడానికి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ప్రవేశించాలనుకునే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈ ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ఉపయోగపడుతుందని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు రమ్య శ్రీని 9381893839, జీవన్‌ను 9182927627 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

గాయనీ గాయకుల రక్తదానం

రక్తదానం చేస్తున్న గాయనీ గాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ వద్దగల రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు కళాకారులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను రెడ్ క్రాస్ కార్యదర్శి రవికుమార్ అందించారు. విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భయ్యా శ్రీనివాస్, భూపతిరావు, ప్రతినిధులు వర్రే నాంచారయ్య, ఎంవిఆర్. నాగేశ్వరరావు, సన్ మూర్తి, ఫణి స్వామి, పట్టం వెంకటేష్, రాధారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు భయ్యా శ్రీనివాస్, భూపతిరావు మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం ప్రారంభమైన తమ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

గురుద్వారాను పరిరక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గురుద్వారాను పరిరక్షించాలని కోరుతూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొందరు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గురుద్వారా మాజీ కార్యదర్శి సతేంద్ర సింగ్ శెట్టి మాట్లాడుతూ ప్రస్తుత గురుద్వారా అధ్యక్షుడు డిఎస్.ఆనంద్ అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భక్తితో దాతలు ఇచ్చిన సొమ్ములు దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. గురుద్వారాకు వచ్చే నిధులను వారి సొంత గురునానక్ ఛారిటబుల్ ట్రస్టుకు వాడుతున్నట్టు తెలిసిందన్నారు. ఈ అంశాలపై ప్రశ్నించినందుకు తనపై ఫిర్యాదు చేసి ఫోర్త్ టౌన్ పోలీసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గురుద్వారా మాజీ కార్యదర్శి బలవేంద్ర సింగ్, అమర్ దీప్ సింగ్, హర బీర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కె బీచ్‌లో యుబిఐ ఉద్యోగుల విజిలెన్స్ వాక్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ విజిలెన్స్ వారోత్సవాలు - 2023లో భాగంగా యూనియన్ బ్యాంక్ విశాఖపట్నం రీజియన్ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు ఆదివారం ఆర్‌కె బీచ్‌లో విజిలెన్స్ వాక్ నిర్వహించారు. అలాగే స్థానిక కళాశాల ప్రాంగణంలో ఉద్యోగులకు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. తొలుత యుబిఐ ఆర్‌కె మిషన్ శాఖ బ్యాంక్ జనరల్ మేనేజర్ జివిఎన్.భాస్కరరావు ఉద్యోగులచే అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి, అవినీతి రహిత భారతావని నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌కె మిషన్‌కు చెందిన స్వామి వైద్యానంద, యుబిఐ రీజినల్ అధికారి కె.దండేశ్వరరావు, ఎజిఎంలు కె.నటరాజ్, బి.రమేష్, వై.నరేష్ కుమార్, ఎల్.సుధాకర్, చీఫ్ మేనేజర్ బి.రాజశేఖర్, విజిలెన్స్ అధికారి అబ్దుల్ అజీమ్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

రాధాకృష్ణ ఉత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 26వ తేదీన శ్రీశ్రీశ్రీ రాధాకృష్ణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉదయం శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో యాదవ సంఘ సమావేశం జరిగింది. దీనిలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

బలనిరూపణ దిశగా ప్రధాన పార్టీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాన రాజకీయ పార్టీలుగా ఉన్న అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్ష టిడిపి, దాని మిత్ర పక్షమైన జనసేన ఓటర్లను ఆకర్షించేందుకు ఇప్పటి నుంచే యాత్రలు ప్రారంభించారు. పేర్లు ఏమైనా సరే ప్రధాన రాజకీయ పార్టీల యాత్రలన్నీ రాజకీయ ప్రయోజనాలను ఆశించే అన్నది సుస్పష్టం.

- సభ సక్సెస్‌తో వైసిపిలో జోష్
- పొత్తు నేపథ్యంలో టిడిపిలో అంతర్మథనం..
- ప్రత్యామ్నాయ విధానాలతో వామపక్షాలు

అధికార వైసిపి శనివారం సాయంత్రం చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన బస్సు యాత్ర సభ సక్సెస్ కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. సామాజిక సాధికార బస్సు యాత్ర అనే కంటే రానున్న ఎన్నికలకు బల నిరూపణ సభగా పేర్కొనవచ్చు. ఈ సభలో డ్వాక్రా గ్రూపు మహిళలు, వార్డు, గ్రామ వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భీమిలి నియోజక వర్గంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికార పార్టీ ప్రతినిధి. ఇతనిపై ఆ పార్టీలోని మెజారిటీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి ఉందని ఆ పార్టీలోనే పలువురి నోట గుసగుసలు వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో భీమిలి నుంచే బరిలో ఉంటానని స్వయంగా ఆయనే చెబుతున్నారు. అయితే ఆ పార్టీ అధినేత, సిఎం జగన్ చరిష్మాకు తోడు కుల, ధన ప్రభావంతో ఎలాగైనా గట్టెక్క వచ్చన్న ధీమాతో ముత్తంశెట్టి ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇతనికి టిక్కెట్టు దక్కినా దక్కకున్నా అధికార పార్టీ అభ్యర్థి ఎవరైనా పేరుకే సంక్షేమ పథకాలు గెలిపి స్తాయని అధికార పార్టీ బయటకు చెబుతున్నా కుల, ధన ప్రభావం వచ్చే ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపనుందనేది వాస్తవం.

వైసిపికి దీటుగానే టిడిపి

టిడిపి రాష్ట్రంలో గానీ ఇక్కడ గానీ అధికారంలో లేకున్నా సరే ఢీ అంటే ఢీ అనే స్థాయిలో ఇక్కడ టిడిపి, అధికార వైసిపిని రాజకీయంగా శాసించే స్థాయిలో ఉంది. 2019 ఎన్నికలను పరిశీలిస్తే చావు తప్పి కన్ను లొట్ట పోయిన చందాన వైసిపి గెలిచింది. టిడిపి అభ్యర్థి సబ్బం హరికి 91,598 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 1,00,540 ఓట్లు వచ్చాయి. ముత్తంశెట్టి శ్రీనివాసరావు కేవలం 8,942 ఓట్ల మెజారిటీతోనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. జనసేన అభ్యర్థి పంచకర్ల సందీప్‌కు 24,114 ఓట్లు వచ్చాయి. జనసేన బరిలో ఉన్నా, లేకున్నా సరే కాపు సామాజిక తరగతికి చెందిన వారు అభ్యర్థి అయి ఉంటే టిడిపినే గెలిచి ఉండేదని అప్పట్లో రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానించారు. ప్రధాన రాజకీయ పార్టీల్లో కులం ఎంతగా ప్రభావం చూపుతుందో 2019 ఎన్నికలే ఓ ఉదాహరణగా పలువురు చెబుతున్నారు. బలమైన ప్రజా పునాది ఉన్న టిడిపి ఇక్కడ ఓటమి చెందింది అంటే ప్రతి సందర్భంలో ఆ పార్టీ తీసుకున్న కొన్ని స్వీయ తప్పిదాలే అని ఆ పార్టీ కార్యకర్తలు బాహాటంగానే చెబుతున్నారు.

పొత్తు నేపథ్యంలో టిడిపిలో అంతర్మథనం?

టిడిపి, జనసేన రాజకీయపరమైన పొత్తు ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో ఇరు పార్టీల కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమి తర్వాత నియోజకవర్గంలో పార్టీని నడిపించే నాయకుడే కరువయ్యాడు. ప్రత్యేక పరిస్థితుల్లో కోరాడ రాజబాబు పార్టీని నడిపించేందుకు నడుం బిగించారు. పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి ఆందోళనా కార్యక్రమాల్లో కూడా నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీలో వారి భాగస్వామ్యం పెంచారు. ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో చంద్రబాబు అరెస్టు తర్వాత రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ పరిణామాలు టిడిపి, జనసేన పొత్తుకు దారి తీశాయని చెప్పవచ్చు. అయితే ఈ పొత్తు వల్ల ఎవరికి నష్టం, ఎవరికి లాభం? అన్న చర్చ వైసిపి, టిడిపి, జనసేనలో సాగుతోంది.

బల నిరూపణగా సందీప్ పుట్టిన రోజు వేడుకలు?

ఈ నెల 26న ఆనందపురం మండలం, పెద్దిపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అట్టహాసంగా జరిపిన జనసేన నియోజకవర్గ కన్వీనర్ పంచకర్ల సందీప్ పుట్టిన రోజు వేడుకలు కాస్తా ఆ పార్టీ బల సమీకరణ సభగా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పొత్తులో టిడిపి అయినా, జనసేన అయినా సమిష్టిగా కలిసే పనిచేస్తామని జనసేన నాయకులు చెబుతున్నారు. అయితే ఒక వేళ ఇక్కడ జనసేన పార్టీ అభ్యర్థి ఉమ్మడి అభ్యర్థిగా నిలిస్తే, ఇక్కడ బలమైన ఓటు బ్యాంక్ ఉన్న టిడిపి, జనసేనతో కలిసి పని చేసేందుకు సిద్ధ పడుతుందా? అనేది ప్రశ్నగానే చెప్పవచ్చు. చిత్తశుద్ధితో ఇరు పార్టీలు కలిసి పనిచేస్తే గనుక వైసిపి ఓటమి తథ్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యామ్నాయ విధానాలతో వామపక్షాలు...

వామపక్షాలు ముఖ్యంగా సిపిఎం ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకెళ్తున్నాయి.1 ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు, సబ్‌ప్లాన్ అమలు, దళితులకు రక్షణ, జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సుల అమలు, చేతి వృత్తులకు రక్షణ, బిసిలకు సబ్ ప్లాన్, ప్రత్యేక నిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు నిధులు, స్వయం ఉపాధికి రుణాలు, సబ్సిడీలు ఇవ్వాలని, విశాఖలో రైల్వే జోన్, ఆయిల్ రిఫైనరీ, పారిశ్రామిక కారిడార్ మొదలగు హామీలను కేంద్రం అమలు చేయకపోవడం, భీమిలి డివిజన్ పరిధిలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, పేద, మధ్య తరగతి రైతుల భూ సమస్యలపై సిపిఎం పోరాటాలు నిర్వహిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం శక్తి మేరకు ప్రజలను కదిలించి పోరాటాలు నడుపుతోంది.

ఆర్థిక సహాయం చేస్తున్న టీమ్ తారక్ ట్రస్టు సభ్యులు

ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఇటీవల నీలకుండీలు రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మిందివానిపాలెం గ్రామానికి చెందిన జోగ సురేష్ కుటుంబానికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులైన టీమ్ తారక్ ట్రస్టు సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు నాగిశెట్టి పృధ్వీరాజ్ మాట్లాడుతూ, ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబానికి ఇది చిరు సహాయం లాంటిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పక్కుర్తి అప్పలనాయుడు, సాయి, పవన్, బూర్లు అప్పలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో భేటీ అయిన బివి.రామ్

1న 'తెలుగు వీర లేవరా' ఆడియో విడుదల

ప్రజాశక్తి -భీమునిపట్నం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ప్రజలు కదలాలి, నిజం గెలవాలి అనే సంకల్పంతో నవంబర్ 1న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలుగు శక్తి ఆధ్వర్యాన ఆడియో విడుదల చేయనున్నట్లు తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో ఆదివారం ఆయన భేటీ అయ్యారు. గంటా చేతుల మీదుగా ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఎపియుఎస్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -పద్మనాభం : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఎపియుఎస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం పద్మనాభం జిల్లా పరిషత్ హైస్కూల్లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అయినాల అప్పారావు, కార్యదర్శులు చిన్ని శ్రీనివాసరావు, ఎస్.ఉమాగుప్తా సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా అవనాపు అరుణ్‌కుమార్, గౌరవాధ్యక్షులుగా కాళ్ల గోపీనాథ్, ప్రధాన కార్యదర్శిగా ప్రయాగ తిరునాథమూర్తి, కోశాధికారిగా ఎంఎన్‌వి.విశ్వనాథ్, కార్యదర్శులుగా సతీష్, సురేష్, గణేష్, అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఈశ్వరరావు, తమ్మినాయుడు, మహిళా కన్వీనర్‌గా డి.జయలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. సిపిఎస్, జిపిఎస్ కాకుండా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెన్నారావు, సూర్యనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో బతుకమ్మ వేడుకలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరం సి భవన్‌లో బతుకమ్మ వేడుకలను స్టీల్‌ప్లాంట్ సిజిఎం (వర్క్స్) ఇంఛార్జి ఎన్‌వి.స్వామి, డబ్లుఎమ్‌డి, ఎస్ఎంఎస్-1 హెచ్‌ఒడిలు రవిశేఖర్, పి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.కుమారస్వామి, జి.ఆనంద్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా ఉక్కులోని తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం కృషిచేస్తోందన్నారు. ఉక్కునగరంలో ఏటా తమ సంఘం ఆధ్వర్యాన బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌లోని తెలంగాణ ఉద్యోగుల కుటుంబాలు ఈ వేడుకల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటా పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, జి.మల్లేశం, ఎన్.నర్సింగరావు, టి.ప్రభాకర్, సిహెచ్.రవికుమార్, జె.శ్రవణ్‌కుమార్, ఎ.శంకర్ పాల్గొన్నారు.

నేడు ఆదర్శనగర్‌లో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధి రెండో వార్డు ఆదర్శనగర్-1 వార్డు సచివాలయ ప్రాంగణంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ బి.రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దుర్గామాత అనుపు ఉత్సవాలు

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస కూడలిలో దుర్గామాత అనుపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పతివాడు నర్సింగరావు ఆధ్వర్యాన భజన, చిడతలు, కోలాటం పులి వేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి అమ్మవారిని ఊరేగించారు. వేములవలస ఎస్‌సి కాలనీలో ఉత్సవ కమిటీ సభ్యులు 3000 మందికి అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు మధు, శ్రీను, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ కార్మికవాడలో జి.రమణారెడ్డి అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న స్థానికులు, ఫుట్ బాల్ క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి తమ సొంత నిధులతో నెలకు సరిపడా నిత్యావసర సరుకులను కొనుగోలు చేసి ఆదివారం కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, అనకాపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

నిన్న అలా.. నేడు ఇలా...

వైసిపి సభతో శనివారం మార్కెట్‌ను నిర్మానుష్యం చేసిన పోలీసులు

ఆదివారం షరా మామూలైన మార్కెట్

ప్రజాశక్తి -తగరపువలస : శనివారం సాయంత్రం చిట్టివలస ఫుట్ బాల్ గ్రౌండ్‌లో వైసిపి సామాజిక సాధికార యాత్రకు కొనసాగింపుగా భారీ బహిరంగ సభ నిర్వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారికిరువైపులా ఉన్న తోపుడు బళ్లను, రోడ్డుపై తట్టలు, బుట్టలు పెట్టి పళ్ళు అమ్ముకునే వ్యాపారులను పోలీసులు ఖాళీ చేయించారు. పలువురు రాష్ట్ర మంత్రులు సభకు వస్తున్నందున ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ సమస్య తాత్కాలికంగానైనా (మంత్రులు వచ్చే సమయంలో) సరే ఉండకూడదని పోలీసులు భావించి ఉండవచ్చు. అందుకేనేమో నిత్యం రద్దీగా ఉండే ప్రయివేట్ మార్కెట్ వద్ద శనివారం ఉదయం నుంచి సభ ముగిసే సాయంత్రం వరకు రద్దీ కనబడనే లేదు. ప్రయివేట్ మార్కెట్ వద్ద ప్రతి రోజూ ఇలా ఉంటే బాగుండేదేమో అన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తంచేశారు. ఆదివారం మాత్రం ఎప్పటివలే మార్కెట్ వద్ద రద్దీగా మారింది.

సాక్షాత్తూ ముఖ్యమంత్రి తగరపువలస వస్తున్నారా అనేలా వైసిపి నాయకత్వం భారీ ఏర్పాట్లు చేసింది. పోలీసులు, జివిఎంసి, ఇతర శాఖల అధికారుల హడావిడి చూసిన స్థానికులు సిఎం వస్తున్నారా అని పలువురిని అడగడం కనిపించింది.

టిబి విభాగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-మధురవాడ : మెడికల్ అండ్ హెల్త్ విభాగంలోని టిబి డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి టిబి యూనిట్ జిల్లా ప్రెసిడెంట్ గోపి, సెక్రటరీ వీరబ్రహ్మం వినతిపత్రం అందించారు. టిబి డిపార్ట్‌మెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 330 మంది ఉద్యోగులు రెగ్యులర్ కోసం ఎదురుచూస్తున్నారని, ఉమ్మడి విశాఖ జిల్లాలో 37 మంది 2003 నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. డిఎస్‌సి ద్వారా నియమితులైన వీరంతా అర్హులేనని వివరించారు.

వైవి.సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న టిబి యూనిట్ సిబ్బంది

నిరుపయోగంగా ఈతకొలను

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి వికాస్‌నగర్‌లో 2010 సంవత్సరంలో నిర్మాణం చేపట్టిన ఈత కొలను ప్రస్తుతం నిరుపయోగంగా పడి ఉంది. గాజువాక ప్రాంతంలో నివాసముంటున్న ప్రజల కోసం స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేపట్టాలని అప్పట్లో జివిఎంసి పాలకవర్గం కౌన్సిల్లో తీర్మానం చేసి 2000 గజాల స్థలంలో ఈత కొలను ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయి. తర్వాత మెటీరియల్ ధర పెరిగిందని సంబంధిత కాంట్రాక్టర్ జివిఎంసి అధికారులకు విన్నవించుకున్నారు. ఎస్టిమేషన్ పెంచకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలో వదిలేశారు. ఈ లోగా రెండుసార్లు సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు దాన్ని పట్టించుకోలేదు. ఆ మధ్య కాలంలో జివిఎంసికి ఎన్నికలు జరగక కార్పొరేటర్లు కూడా లేని స్థితి ఉండేది. దీంతో ఈత కొలను నిరుపయోగంగా మారింది. దాని తలుపులు చోరీకి గురయ్యాయి. రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా తయారైంది. విష సర్పాలకు నిలయంగా మారింది. దీంతో చుట్టుపక్కల ఇళ్లలోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీన్ని వినియోగంలోకి తెస్తే ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల ఇంజనీరింగ్ అధికారులు మరో రూ.13 లక్షల వ్యయంతో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి టెండర్లు కూడా పిలిచారు. ఆ పనులు పూర్తయితే పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తుంది.

దీనిపై జోనల్ కమిషనర్ సింహాచలాన్ని వివరణ కోరగా టెండర్లు పూర్తి అయ్యాయని, త్వరలో పనులు పూర్తవుతాయని తెలిపారు. వీలైనంత తొందరలో వినియోగంలోకి తెస్తామని చెప్పారు.

నిరుపయోగమైన ఈత కొలను

ర్యాలీ చేస్తున్న శిష్టకరణాల అసోసియేషన్ నాయకులు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు త్యాగాలకైనా సిద్ధం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని కూర్మన్నపాలెం శిష్ట కరణాల అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు చెప్పారు. ఉక్కు ఉద్యమం వెయ్యి రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో నవంబర్ 8న చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని కోరుతూ కూర్మన్నపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ కారణంగానే విశాఖ అభివృద్ధి చెందిందని, అన్ని వర్గాల వారికి ఉపాధి లభిస్తోందని తెలిపారు. ప్లాంట్‌కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఇంకా పూర్తి స్థాయిలో ఉపాధి లభించలేదని, వీరికి ఉపాధి కల్పించి న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. అధ్యక్షుడు పిఎస్‌విఎస్.గోపాల్ మాట్లాడుతూ, కూర్మన్నపాలెం శిష్ట కరణాల సంఘం సభ్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు కె.రవీంద్ర, గర్భం నాగేశ్వరరావు, డబ్బీరు గురునాధరావు, డి.కృష్ణారావు, మానాపురం శ్రీనివాస పట్నాయక్, శేఖరమంత్రి వరలక్ష్మి, రామచంద్రరావు, ప్రసాదరావు, వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, బివిఎం.కృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎంవివి.గాంధీ

ఉచితంగా బిపి, సుగర్ పరీక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : అల్లూరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు రోడ్డులోని నర్సింహరాజు ఇంటి వద్ద ఉచితంగా బిపి, సుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవివి.గాంధీ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పక్షవాతం, గుండె జబ్బులు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ప్రతి రోజూ అరగంటకు తక్కువ కాకుండా వాకింగ్ చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి నర్సింహరాజు, ఎస్.సంజీవయ్య, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్ విజేతలకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి -గాజువాక : జిల్లాస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల విజేతలకు సాహితీ కంప్యూటర్స్ అధినేత కర్ణంరెడ్డి నర్సింగరావు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పోటీల్లో 30 నుంచి 90 ఏళ్ళ వయసున్న మహిళలు పురుషులు 200 మంది పాల్గొన్నారని తెలిపారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసినట్లు చెప్పారు. ఈ పోటీల్లో విజేతలు డిసెంబరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్టర్ అథ్లెట్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బాబూరావు, మంగా వరప్రసాద్, ఆర్మీ గోవింద్, రామారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఐదు కిలో మీటర్ల నడకలో మహిళల విభాగంలో నిర్మల, లక్ష్మీదేవి, సరోజిని, రూప్సీ, విజయలక్ష్మి, విమల, పద్మావతి, అనుపమ, రమణ, పురుషుల విభాగంలో యాకబ్, సత్యారావు, ముత్యాలు, కిరణ్, రాజు, రవీంద్ర తదితరులు విజేతలుగా నిలిచారు.

విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయ సేవ

శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.వల్లభనాయుడు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వల్లభనాయుడు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రజలకు సత్వర న్యాయం చేయడమే శాశ్వత లోక్ అదాలత్ ప్రధాన లక్ష్యమని జిల్లా జడ్జి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.వల్లభనాయుడు అన్నారు. స్టీల్ సిఐటియు, శాశ్వత లోక్ అదాలత్ ఆధ్వర్యాన ఉక్కునగరం స్టీల్ సిఐటియు కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యవక్తగా జి.వల్లభనాయుడు మాట్లాడుతూ, ప్రజోపయోగ సేవకు సంబంధించి కోటి రూపాయలు విలువ మేరకు వివాదాలను పరిష్కరించే అధికారం లోక్ అదాలత్‌కు ఉందని వివరించారు. ప్రజా రవాణా, విద్యుత్, నీటి సరఫరా, పారిశుధ్యం లేక ప్రజా సంరక్షణ సేవ, భీమ, వైద్యశాల, బ్యాంక్ ఇతర ఆర్థిక లావాదేవీలు, విద్యాలయాలు, గృహము, స్థిరాస్థి సేవలకు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంబంధించిన వివాదాలను దీని ద్వారా పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఎటువంటి రుసుం చెల్లించకుండా న్యాయం పొందవచ్చన్నారు. ఇరుపక్షాల వారికి అంగీకారమైన తీర్పు వస్తుందని, దీనిని హైకోర్టులోనే మరలా ప్రశ్నించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. దీనిని ప్రజలు ఉపయోగించుకుని వివాదాలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు అబ్దుల్ అసరాఫ్, జి.సత్యనారాయణ, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షులు వైటి దాస్, నాయకులు బిఎన్.మధుసూదన్, పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, యు.వెంకటేశ్వర్లు, గంగాధర్, టివికె.రాజు, నీలకంఠం, మరిడయ్య, కృష్ణమూర్తి, సిహెచ్ వెంకటరావు, తాడన్న, గురప్ప, కృష్ణారావు, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

సింహాచలం : కావలి వద్ద ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడిని ఖండిస్తూ విశాఖ పరిధిలోని సింహాచలం డిపో వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యాన ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఇవిఎం.రాజు మాట్లాడుతూ సిబ్బందికి యాజమాన్యం రక్షణ కల్పించాలని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ కెజెపి.రావు, యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: ఆర్టీసీలో పని చేస్తున్న డ్రైవర్లకు, కండక్టర్లకు భద్రత కల్పించాలని ప్రజా రవాణా శాఖ వైఎస్‌ఆర్ ఫెడరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ గేటు ముందు నిరసన చేపట్టారు. కావలి డిపో డ్రైవర్, కండక్టర్లపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం అనకాపల్లి జిల్లా వైయస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి వి.దేముడు మాట్లాడుతూ, కావలి ఆర్టీసీ డిపో డ్రైవరు, కండక్టర్ పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డిపో కండక్టర్, డ్రైవర్‌పై 14 మంది అతి కిరాతకంగా దాడి చేయడం హేయమైన చర్యని ఆయన అన్నారు. ఇటీవల కశింకోట మండలం చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన ఆర్టీసీ సిబ్బందిపై 40 మంది దాడి చేయడం, నర్సీపట్నం డిపోకు చెందిన జిల్లేడు పూడి గ్రామానికి చెందిన రాంబాబు పై దాడి చేయడం జరిగిందని ఇటువంటి ఘటనలు పలుచోట్ల చోటు చేసుకోవడం చాలా దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ సిహెచ్ గోవింద, నర్సీపట్నం డిపో ప్రెసిడెంట్ కెవిఎన్ రావు, జాయింట్ సెక్రటరీ ఎల్ వై నాయుడు, తలుపులు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనవసరం తగాదాలు, సెటిల్‌మెంట్లలో తలదూర్చకుండా క్రమశిక్షణతో మెలగాలని చెప్పారు. వివాదాలు, సెటిల్‌మెంట్లను ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ పని తాము చేసుకుంటూ క్రమశిక్షణతో మెలగాలని హితవు పలికారు.

పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేముడు

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి పురుషోత్తపురం సమీపంలోని గాయత్రినగర్‌లో రూ.9.65 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు చేయ్యాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ దుర్గాప్రసాద్, అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కోరాడ చందు యాదవ్, జొన్నాడ సాయికృష్ణ, రమణమూర్తి, బొడ్డ దేముడుబాబు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'మార్టిన్' నటీనటులకు సన్మానం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పౌర గ్రంథాలయంలో కామెడీ క్లబ్ ఆధ్వర్యాన 'మార్టిన్' చిత్ర నటీనటులను ఆదివారం ఘనంగా సన్మానించారు. హాస్య ప్రియ కామెడీ క్లబ్ అధ్యక్షులు నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశ రావు మాట్లాడుతూ, ఇటీవల విడుదలైన మార్టిన్ చిత్రం మంచి విజయం సాధించిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చెబుతూనే ఓటరే అసలైన కింగ్ అని, సమాజంలోని అసమానతలను కూడా ఎత్తిచూపుతూ ఈ సినిమా ఆలోచింపజేస్తుందని తెలిపారు. ఇటువంటి మంచి చిత్రాలను ఆదరించాలని కోరారు. లీడర్ రమణమూర్తి, కాశీ విశ్వేశ్వరరావు, చిన్నారావు, త్రినాధరావు, స్వామి తదితరులు మాటాడుతూ, ఈ సినిమా వర్తమాన రాజకీయాలపై ఓ వ్యంగాస్త్రమని పేర్కొన్నారు. అలా అని ఎవ్వరినీ నొప్పించేలా ఉండదన్నారు. చిన్న బడ్జెట్ చిత్రం ఆయనప్పటికీ పలువురి మన్ననలు పొందిందన్నారు. ఈ చిత్రానికి పూజ కొల్లూరి దర్శకత్వం, మహా వెంకటేష్ నిర్మాతగా వ్యవహరించారని తెలిపారు. చిత్రంలో నటించిన విశాఖ కళాకారులు ఈశ్వరరావునాయుడు, మల్లికను అభినందించి, శాలువాతో సత్కరించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ, సినిమాలో నటించే విధంగా ప్రోత్సహించిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజారక్షణ భేరి యాత్రను జయప్రదం చేయండి

మునగపాక, అచ్చుతాపురంలో పోస్టర్ల ఆవిష్కరణ

మునగపాకలో ప్రజారక్షణ భేరి పోస్టర్ల ఆవిష్కరణలో సిపిఎం నేతలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి, మెరుగైన సమాజం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రజాసంఘాల కార్యాలయం ఆవరణలో యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి పాలనలో కార్మికులు, రైతులు, సామాన్య ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి తీవ్రంగా అన్యాయం చేసిన బిజెపికి పుట్టగతులు లేకుండా చేయాలని, వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

దేశంలోని సహజ వనరులను, ప్రభుత్వంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందన్నారు. రాష్ట్రంలో పాలకవర్గాలకు ధీటుగా ప్రజాప్రణాళికతో సిపిఎం ప్రజల ముందుకు వస్తోందని, ఇందులో భాగంగా నిర్వహించే ప్రజారక్షణ భేరి యాత్ర వచ్చేనెల 5న అనకాపల్లి జిల్లాకు చేరుకుంటున్న సందర్భంగా ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరి యాత్ర ముగింపు సభకు పెద్ద ఎత్తున ప్రజలు కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల శాఖ కార్యదర్శి టెక్కలి జగ్గారావు, ఎస్ బ్రహ్మాజీ, పెంటకోట సత్యనారాయణ, అల్లారపు లోవేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్చుతాపురం : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజారక్షణభేరి బస్సుయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం తిమ్మరాజుపేటలో సిపిఎం అచ్చుతాపురం డివిజన్ కన్వీనర్ ఆర్.రాము, పార్టీ సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, కె.సోమినాయుడు ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా మందస నుంచి వచ్చేనెల 2న ప్రారంభమయ్యే బస్సు యాత్ర 5న అచ్యుతాపురం చేరుకుంటుందని, దీన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి బస్‌యాత్రలు బయలుదేరి, వచ్చేనెల 15న విజయవాడ చేరుకుంటాయని, ఈ సందర్భంగా నిర్వహించే ప్రజారక్షణ భేరి బహిరంగ సభ విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తిమ్మరాజుపేట గ్రామశాఖ కార్యదర్శి ఎస్. రా మునాయుడు, హరిపాలెం శాఖ కార్యదర్శి బొడ్డేడ రామ్ కుమార్, సెల్లుబోయిన అప్పారావు, బుద్ధ రంగారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఆకట్టుకున్న పోలీస్‌బ్యాండ్

నాలుగురోడ్ల కూడలిలో పోలీస్ బ్యాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక నాలుగు రోడ్లు జంక్షన్ వద్ద అనకాపల్లి జిల్లా పోలీసులు ఆదివారం నిర్వహించిన పోలీస్ బ్యాండ్ ఆకట్టుకుంది. దేశభక్తి పాటలు, వీనుల విందైన సంగీతాన్ని వినిపించారు. ఈ సందర్భంగా అనకాపల్లి టౌన్ ఎస్ఐ సింహాచలం మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను కొనియాడారు. వారి త్యాగాలను స్మరిస్తూ, ఏటా పోలీసు అమరవీరుల వారోత్సవాలను నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల ఆత్మకు శాంతి చేకూరాలంటూ జోహార్లు అర్పించారు. పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా రిబ్బన్ కంపెనీ వార్షికోత్సవం

మాట్లాడుతున్న కంపెనీ డైరెక్టర్ స్టీవ్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం సెజ్‌లో బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీలో ఉన్న రిబ్బెస్ట్ రిబ్బన్ కంపెనీ 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా చేశారు. ఈ సందర్భంగా రిబ్బన్ కంపెనీ డైరెక్టర్ స్టీవ్ మాట్లాడుతూ కంపెనీ ఉద్యోగులందరినీ కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నామని, ఉద్యోగుల వివాహం, వారికి మొదటి బిడ్డ పుట్టినప్పుడు, ఐదేళ్ల సీనియారిటీ ప్రోత్సాహకం తదితర సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో ఉద్యోగుల సాంప్రదాయ ఆటలు, సాంస్కృతిక ప్రదర్శన, నృత్య పోటీలు, లక్కీ డ్రా వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కంపెనీ ఇండియన్ డైరెక్టర్ శివప్రసాద్, కంపెనీ మేనేజర్లు క్రాంతికుమార్, శివ, జగన్, మోహన్, రవి, రామ సురేష్, అశోక్, లక్ష్మీపతి, శ్యామ్, సిబ్బంది ఆది, వంశీ, నరసింగ్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అభివృద్ధికి సహకారం

మంచినీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి- చోడవరం : వాకర్స్ క్లబ్ అభివృద్ధికి సహకారం అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం వాకర్స్ క్లబ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా చోడవరంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఓరుగంటి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో క్లబ్ భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.50,116 నగదు , నిర్మాణ పనులకు అవసరమయ్యే ఇసుక ఇస్తానని ధర్మశ్రీ ప్రకటించారు. క్లబ్‌కు ఎసి ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా అవసరమైన సాయం చేస్తానన్నారు. శ్లాబ్‌కు పిక్క ఇస్తానని క్లబ్ సభ్యులు, సామాజిక కార్యకర్త పసుమర్తి మల్లిక్ వెల్లడించారు. కామిరెడ్డి జగన్నాథం రూ.10వేలు ఆర్థికసాయం ప్రకటించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, ఎపిపి. వి.వెంకటరావులను సత్కరించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కనిశెట్టి నాగ అప్పారావు, కార్పెంటర్ రాజు, యోగా శ్రీను, కొమ్మిరెడ్డి భాస్కరరావు, కె. నాగేశ్వరరావు, విస్సారపు నాగూర్, క్లబ్ సంయుక్త కార్యదర్శి ఎం.జి.మనోహర్, సమన్వయ కర్త టి.వి.రమణ జాజుల జగ్గారావు, తటవర్తి సూర్యనారాయణ, సీనియర్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపు హామీ అమలులో వైఫల్యంపై

నేడు గోవాడ సుగర్స్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు చెల్లించవలసిన రూ.12 కోట్ల బకాయిలు చెల్లిస్తామని వారం రోజుల్లోనే చెల్లిస్తామని మహాజనసభలో హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా నేటికీ చెల్లించకపోవడంపై సోమవారం షుగర్ ఫ్యాక్టరీ వద్ద జనసేన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని జనసేన మండల అధ్యక్షుడు జి మూలునాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఊరు ముత్యాల నాయుడు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మహాజనసభలో రైతులు, కార్మికులకు ఇచ్చిన హామీ అమలులో విఫలమయ్యారన్నారు. దీనిని నిరసిస్తూ జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు ఆధ్వర్యంలో రైతులతో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు..

2న ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజి ప్రోగ్రాం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి- అనకాపల్లి : భిన్నత్వంలో ఏకత్వం భావన, దేశ సాంస్కృతిక, సంప్రదాయ వారసత్వంపై అవగాహనకు 'ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్' ప్రొగ్రాం దోహదపడుతుందని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్రం, కేంద్ర హోం శాఖ సంయుక్త నిర్వహణలో అచ్యుతాపురం ఎంఎస్ఎంఇలో నవంబర్ 2 నుంచి జరగనున్న 'ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్' ప్రొగ్రాం పోస్టర్‌ను ఆదివారం స్థానిక వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు హాలులో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ అభివృద్ధి కార్యకలాపాలు, పారిశ్రామిక పురోగతిలో గిరిజన యువతను భాగస్వాములను చేయడం, భావోద్వేగ సంబంధాలను పెంపొందించుకోవడానికి 'ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్' ప్రొగ్రాం సహాయపడు తుందన్నారు. గిరిజన భాష, సంస్కృతి, జీవన వ్యవహార శ్కైలి, ఆర్థిక పరిస్థితులు, నివసించే పద్ధతులు, ప్రాంతాలను బట్టి వివిధ ప్రాంతాలలో వివిధ రకాలుగా ఉంటుందని, దీన్ని గిరిజన యుత పరస్పరం తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నెహ్రూ యువ కేంద్రం యూత్ ఆఫీసర్ జి. మహేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మీగడ పరాషర్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పూర్వపు మేనేజర్ బుద్ధ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై పగ సాధించేందుకు

వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు..

వైసిపి ప్రజాప్రతినిధుల ప్రకటనలపై బుద్ధ ఫైర్

మాట్లాడుతున్న బుద్ధ నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో వ్యవస్థలను మేనేజ్ చేస్తూ చంద్రబాబుపై జగన్‌రెడ్డి పగ సాధిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, పాలన గాలికి వదిలేసి కేవలం చంద్రబాబు జైలు నుండి విడుదల కాకుండా ఉండడానికి కోర్టులలో విచారణ జాప్యం చేయడానికి ఎత్తులు కుయుక్తులు, పన్నాగాలు వేస్తున్నారన్నారు. చంద్రబాబు జైల్లోనే చనిపోతారంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపీలు ప్రకటనలు చేస్తుండడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

చంద్రబాబు భద్రత పట్ల సందేహాలున్నాయని, వాటిని నివృత్తి చేయవలసిన బాధ్యత హోంశాఖ మంత్రిపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సాలాపు నాయుడు, బోడి వెంకటరావు, ఆళ్ల రామచంద్రరావు, బొడ్డేడ మురళి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని సబ్బవరం-1 సెక్షన్ పరిధిలో ఈ నెల 30న విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం-1సెక్షన్ పరిధిలోని 33/11కె వి సబ్బవరం సబ్ స్టేషన్ ఎంహెచ్‌క్యూ ఫీడర్‌లో రోడ్ క్రాసింగ్ లైన్ వర్క్ కారణంగా సోమవారం ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపేస్తున్నట్లు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు

అపూర్వ కలయిక

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- కె.కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం 2002.-03 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. పూర్వ విద్యార్థులంతా కలుసుకుని, ఒకరునొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 200 విద్యార్థులు ఈ అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్నారు.20 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరందరూ ఆనందంతో రోజంతా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను సన్మానించి, వారి ఆశీస్సులు పొందారు. ఏటా ఇలాగే ఏదో ఒకచోట పూర్వవిద్యార్థులంతా కలుసుకోవాలని నిర్ణయించారు కార్యక్రమంలో ఆకుల జగదీష్, కొయ్య రాంబాబు, గూడూరు గణేష్, చల్ల రామకిషోర్ పాల్గొన్నారు.

సిబ్బంది ఉన్నా...సస్యరక్షణ సూచనలు సున్నా!

సాగు సలహాలకు వ్యాపారులే శరణ్యం
ఆవేదన చెందుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి- చోడవరం : వర్షాభావ పరిస్థితుల్లో వరిపైర్లను ఆశిస్తున్న చీడపీడల నుంచి సస్యరక్షణకు సూచనలు చేసేవారు కరువయ్యారని రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామ సచివాలయాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నా, పంటల పరిస్థితులను పర్యవేక్షించేవారుగానీ, రైతులకు సూచనలు చేసేవారు లేకుండా పోయారని రైతులు వాపోతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో చీడపీడలు ఆశించిన వరి దుబ్బులను తీసుకుని, ప్రైవేటు వర్తకులు వద్దకు తీసుకువెళ్లి, వాటిని చూపించి, వారిచ్చే మందులను కొనుగోలుచేసి పైర్లకు పిచికారీ చేసే దయనీయ పరిస్థితి నెలకొనడం దారుణమన్నారు. రైతుభరోసా కేంద్రాలతో ప్రజల వద్దకే సేవలు అంటూ ప్రభుత్వం చేస్తున్న ఆర్భాటపు ప్రచారానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు కనీస పొంతన లేకుండా ఉందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండలానికి వ్యవసాయ అధికారి, ఎఇఒలు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతో పరిమితమైన సిబ్బంది ఉన్నప్పుడు మండలంలో కొన్ని గ్రామాలైనా పర్యటించి రైతులకు సలహాలు సూచనలు అందించేవారని, కానీ ప్రస్తుతం సచివాలయాల్లో కావాల్సినంతమంది సిబ్బంది ఉన్నా రైతులకు ఒరిగిందేమీ లేకుండా పోతోందని రైతులు అంటున్నారు. పంటల సస్యరక్షణకు క్రిమిసంహార కాలను రైతు భరోసా కేంద్రాల్లో అమ్మకపోగా, సూచనలిచ్చే నాథులే లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి, పంటలను, పైసాలను నష్టపోతున్నామని రైతులు అంటున్నారు. ప్రస్తుతం పొట్టదశలోఉన్న వరిపైర్లకు ఆకుముడత, సుడిదోమ వంటి చీడపీడలతో నష్టం జరుగుతూ, ఎకరాకు పెట్టిన కనీసం రూ.25వేల పెట్టుబడి వస్తుందో, రాదోనన్న ఆందోళనలో అన్నదాతలు ఉంటే, ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమని రైతులు మండిపడుతున్నారు.

పైరుకు క్రిమిసంహారకాలు పిచికారీ చేస్తున్న రైతు

యువకుని మృతిపై డిఎస్‌పి విచారణ

సంఘటనాస్థలిని పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీనివాస్

మృతుడు సాయివర్మ (ఫైల్)

ప్రజాశక్తి -అచ్యుతాపురం : పర్యాటక ప్రాంతమైన కొండకర్ల ఆవలో విహారానికి వచ్చిన విజయనగరం జిల్లాకు చెందిన సాయి వర్మ అనే యువకుడు ఎస్‌విఎస్ రిసార్ట్స్ స్విమ్మింగ్ పూల్‌లో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటనపై డిఎస్‌పి శ్రీనివాస్ ఆరా తీశారు. ఆదివారం సంఘటనాస్థలాన్ని సందర్శించి, ఘటనకు సంబంధించి విచారణ చేపట్టారు.

ప్రకతి సిద్ధంగా ఏర్పడిన కొండకర్ల ఆవను చూసేందుకు ఇటీవల కాలంలో పర్యాటకుల తాకిడి పెరిగింది. సందర్శకులు ఆవ సమీపాన వెలసిన రిసార్ట్స్‌లో బస చేసి, కొండకర్ల ఆవను సందర్శిస్తారు. ఇదే క్రమంలో విజయనగరం జిల్లాకు చెందిన 30 మంది యువకులు శనివారం రాత్రి స్థానిక ఎస్‌విఎస్ రిసార్ట్స్ కు వచ్చి బస చేశారు. రిసార్ట్స్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో స్నానాలు చేశారు. ఈ క్రమంలో సాయివర్మ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. స్విమ్మింగ్‌పూల్‌లోమునిగిపోయిన సాయివర్మను వైద్య చికిత్సకు ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. కొండకర్ల ఆవ సందర్శనకు వచ్చిన యువకుడు మృతి సమాచారంతో డిఎస్‌పి శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. రిసార్ట్స్‌కు ఎంత మంది వచ్చారు, ఎన్ని గంటలకు వచ్చారు, ఏ సమయంలో సాయివర్మ మృతి చెందాడనే అంశాలపై ఆరా తీశారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది, యాజమాన్యం పాత్ర పై వివరాలు అడిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాగా ఇటీవల కాలంలో రిసార్ట్స్‌లో ఇటువంటి ప్రమాదకర సంఘటనలు పలు జరిగినప్పటికీ సంబంధిత యంత్రాంగం నిర్లక్ష్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

అనకాపల్లి జిల్లాలో సామాజిక బస్సు యాత్ర

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి- అనకాపల్లి : వచ్చేనెల 2న మాడుగులలో 9న అనకాపల్లిలో జరగబోయే సామాజిక బస్సు యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ డాక్టర్ సత్యవతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వివేకానంద సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడుతూ, త్వరలో జిల్లా ఆసుపత్రిలో రూ.22కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్, ఐసియు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తి అయ్యాయని, 4నెలలలో నిర్మాణం పూర్తయి, రోగులకు అత్యవసర వైద్య సేవలు అందు బాటులోకి వస్తాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన శిబిరాల్లో గుర్తించిన వికలాంగులకు రూ.1.60కోట్ల విలువైన ఉపకరణాలను వచ్చేనెల 3న అనకాపల్లి మునిసిపల్ గ్రౌండ్‌లో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయ సహాయమంత్రి నారాయణ స్వామి విచ్చే స్తారని తెలిపారు. బ్యాటరీ సామర్థ్యంతో నడిచే మూడు చక్రాల కుర్చీలకు తన ఎంపీ కోటానిధులు రూ.36 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్‌గా విడుదల చేసినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఆర్‌బికెను ప్రారంభిస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోనిరేబాక గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, కాపుశెట్టివానిపాలెం గ్రామంలో రూ.12లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని రాష్ట్రమంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని కోరారు. అనకాపల్లిని అందాల నగరంగా తీర్చిదిద్దాలన్న తన లక్ష్యానికి. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎపిఐడబ్ల్యుఎ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లె సూరిబాబు, రేబాక సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, మాజీ సర్పంచ్ మంత్రి సత్తిబాబు, వైసిపి నాయకులు మార్టూరు సాయి పాల్గొన్నారు.

జగన్ ఎందుకు కావాలో వివరించండి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి - పరవాడ: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలో ప్రజలకు వివరించి చెప్పడం ద్వారావారి సంపూర్ణమద్దతు కూడగట్టి రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే అన్నెంరెడ్డి అదీప్‌రాజు దిశానిర్ధేశం చేశారు. ఆదివారం మండలంలోని వెన్నెలపాలెం సింహాద్రి కల్యాణ మండపంలో వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, నవంబర్ ఒకటి నుంచి నెల రోజులపాటు చేపట్టనున్న 'ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి' కార్యక్రమంపై ఇంటింటా విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు ముఖ్యమంత్రిగా మళ్లీ జగనే అధికారంలోకి రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటు న్నారని, దీన్ని అనుకూలంగా మలుచుకునేలా వైసిపి శ్రేణులు పనిచేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి గత టిడిపి ప్రభుత్వానికి, ప్రస్తుత జగన్ మోహన్ రెడ్డి పరిపాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించి, వారి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సిఇసిసభ్యులు పైలా శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు, అన్నంరెడ్డి అజయ్‌రాజ్,కోన రామారావు, చుక్క రాము నాయుడు, వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, సర్పంచ్‌లు పల్లా అప్పారావు నాగమణి, కుంద్రాపు వరలక్ష్మి సీతారామయ్య, బొంది అచ్చిబాబు, ఎంపిటిసిలు గొర్లి ఎరుకు నాయుడు, సప్ప ప్రభ సన్యాసిరావు, చల్ల కనకారావు, బురద రాజు, వెన్నెల సింహాద్రి, కావలి రాజు, కావలి వాసు, బొద్దపు చిన్నారవు, పైల సత్యనారాయణ, నందవరపు శ్రీనివాసరావు, ఎలమర్తి బుజ్జి, డెక్క శ్రీనివాసరావు, భాస్కర్, కలవలపల్లి సత్యనారాయణ, పల్లా గోవింద్, బండారు శ్రీను, మెరిసా రామారావు, అయ్యబాబు, పాల్గొన్నారు.

145 మందికి ఉచిత కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేయించుకుంటున్న సిఐ ఈశ్వరరావు

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని గొర్లెవానిపాలెం పంచాయతీ, జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని పరవాడ సిఐ పెదిరెడ్ల ఈశ్వరరావు, గొర్లెవానిపాలెం సర్పంచ్ గోర్లి అమ్ములు గోపి, ఎంపిటిసి గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా 145 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు 40 మంది రోగులను కంటి ఆపరేషన్‌కు గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ అలైఖ్య, క్యాంప్ డిప్యూటీ మేనేజర్ అరుణ్ కుమార్, ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, వైస్ చైర్మన్ ఎస్.అర్జున, లెక్కల సత్యనారాయణ మాస్టార్, ట్రస్ట్ సభ్యులు అనకాపల్లి రామస్వామి, సింగంపల్లి రామారావు, సింగంపల్లి నిఖిల్, కాళ్ళ కిరణ్ కుమార్ , గొర్లి నూకరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం నాకిష్టం'

పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కోటేశ్వరరావు వ ూ ట ్లా డ ు త ూ , విద్యార్థులకుమానసికంగా విద్యాపరంగా ఉన్నతమైన ఆశయాలకు చేరుకోవడానికి ఇది ఉపయోగపడు తుందన్నారు.

చిన్న పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగించడం, కథలు చెప్పుట. జోక్స్ వినిపించడం ద్వారా ఈ కారక్రమంలో పిల్లలను భాగస్వాములను చేస్తామన్నారు. గ్రంథాలయానికి రప్పించి, విజ్ఞానాన్ని అందించే పలుపుస్తకాలను చదవాలని ఆసక్తి, ఆలోచన కలిగేలా చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నప్పన్నపాలెం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి 9 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.96,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లుగా అందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసినట్లు తెలిపారు.

నియోజకవర్గ వైసిపి ప్రతినిధిగా శ్రీధర్‌రాజు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గ వైసిపి ప్రతినిధిగా రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచనల మేరకు దంతులూరి శ్రీధర్‌రాజును పార్టీ అధిష్టానం నియమించింది.

ఈనెల 31న తాడేపల్లిలో నిర్వహించనున్న 175 నియోజకవర్గాల ప్రతినిధుల శిక్షణకు హాజరు కావాలని శ్రీధర్ రాజుకు అధిష్టానం ఆహ్వానం పంపింది. ఓటర్ల సవరణ, ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ ప్రతినిధు లకు శిక్షణ ఇవ్వనున్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో అత్యంత కీలకమైన, బాధ్యతాయుతమైన పదవికి శ్రీధర్‌రాజుకు దక్కడంపై పలువురు అభినందనలు తెలిపారు..

దంతులూరి శ్రీధర్‌రాజు

కూరగాయల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి-నక్కపల్లి:కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. మార్కెట్లో కూరగాయల ధరలు చూస్తే ఏమి కొనేటట్టు, ఏమి తినేటట్టు గాని కనిపించ లేదు. దీంతో సామాన్య, మధ్య తరగతికి చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉల్లి ధర అమాంతరంగా పెరిగిపోయింది. వారం, పది రోజుల క్రిందటి వరకు ఉల్లి కిలో రూ.25 నుండి 30 రూపాయలు ఉండగా ఇప్పుడు కిలో రూ.60 రూపాయలకు చేరింది. ఉల్లి ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. వారానికి 2 కిలోలు కొనుక్కునేవారు ఉల్లి ధర పెరగడంతో కిలో, అర కిలో చొప్పున కొనుగోలు చేసుకుని సరి పెట్టుకుంటున్నారు. టమాటా కిలో రూ.40లు, క్యారెట్ కిలో రూ.60లు, బీర కిలో రూ.60, చేమ దుంపలు కిలో రూ.60, వంకాయ కిలో రూ. 30 లు, బెండ కిలో రూ.30, బంగాళా దుంపలు కిలో రూ.25 ల చొప్పున మార్కెట్ లో విక్రయిస్తున్నారు.

ఇక ఆకుకూరలు ధరలు పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇటీవలా టమోటా కిలో రూ.20 లు చొప్పున దొరికేవి.టమోటా ధర దిగి రావడంతో వినియోగదారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.మరల ఇప్పుడు ఒక్కసారిగా కిలో 40 రూపాయలకు చేరింది. కూరగాయలు కొండామని మార్కెట్ కు వచ్చిన వినియోగదారులు ధరలను చూసి షాక్ తింటున్నారు. కూరగాయల ధరలు ఏమిటి ఇలా మండుపోతున్నాయని గుసగులాడుకుంటున్నారు. కూరగాయల ధరలు అందుబాటులో లేకపోవడం వలన సామాన్య, మధ్య

తరగతి ప్రజలు అర ,పావు కేజీ చొప్పున కూరగాయలు కొనుగోలు చేసుకొని పబ్బంగడుపుకుంటున్నారు. రూ.300లు పెట్టి కూరగాయలు కొన్నా వారానికి సరిపోలేని పరిస్థితి నెలకొందని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.ఇక పేదల పరిస్థితి మరింత దారుణం గా ఉంది. కూరగాయలు కొనుగోలు చేసుకునేందుకు మార్కెట్ కు రావాలంటే ధరలను చూసి హడలిపోతున్నారు. ఉల్లి, టమోటా ధర రెక్కలు రావడంతో వాటిని కొనుగోలు చేసుకునేందుకు వినియోగదారులు వెనక్కి తగ్గుతున్నారు. కూరగాయల దిగుబడి తగ్గిపోవడం తోనే రేట్లు పెరిగి పోతున్నాయని వ్యాపారులు తెలిపారు. వర్షాలు పడకపోవడంతో ఆ ప్రభావం కూరగాయల సాగు పై పడింది. ఎక్కడా చినుకు జాడ లేకపోవడంతో రైతులు కూరగాయలను పండించలేక పోతున్నారు. దీంతో పంట దిగుబడి తగ్గడంతో ధరలు మండుతున్నాయి.

పిల్లలను చదివిస్తున్న లైబ్రేరియన్ దమయంతి

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంథాలయం లో గ్రంథాలయాధికారిని పి దమయంతి ఆధ్వర్యంలో చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. పిల్లలతో మాస్ రీడింగ్ కథలు వినిపించడం నేర్పించారు. సింహంరాజు తెలివి, కష్టజీవిదే గెలుపు అను కథలను చదివించి కథల్లో నీతిని వివరించారు. పేరాల వారిగా చదివించి, వాటిని విపులంగా వివరించారు. అనంతరం పిల్లలకు పజిల్ గేమ్ ఆడించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పాములవాక పంచాయితీలో ప్రధాన రహదారిని ఆనుకుని పాఠశాల వద్ద ఉన్న 40వేల లీటర్ల వాటర్ ట్యాంక్ ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఈ ట్యాంకు నిర్మాణం చేపట్టి దాదాపు 50 సంవత్సరాలు పూర్తి కావస్తుందని, ఏ క్షణాన ప్రమాదం ముంచుకొస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వాటర్ ట్యాంక్ నీరు లీకై వృధాగా పోవడంతో పాటు దిగువన పిల్లర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తక్షణమే అధికారులు వాటర్ ట్యాంకును పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు.

శిథిలావస్థలో ఉన్న ట్యాంకు

వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -పాయకరావుపేట:స్థానిక నాగరాజు పేట రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు రైలులో ప్రయాణిస్తూ జారిపడి మృతి చెందాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడు నలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు నెక్ టీ షర్టు ధరించి ఉన్నాడు. వీఆర్వో వెంకటేశ్వరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జోగారావు తెలిపారు.

ఉపాధ్యాయుడు సత్తా

ప్రజాశక్తి -కోటవురట్ల: విశాఖలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలలో 800 మీటర్లు, 200 మీటర్లలో కోటవురట్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు డేవిడ్ సత్తా చాటారు. ఈ మేరకు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ, వచ్చే నెల 9 ,10 తేదీలలో కావలి వద్ద జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఈ సందర్భంగా తెలిపారు.

మెడల్స్ అందుకుంటున్న ఉపాధ్యాయుడు డేవిడ్

అనారోగ్యంతో యువతి మృతి

ప్రజాశక్తి-చీడికాడ:మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరంతో యువత మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఎర్ర అనూష (17) గాజువాకలోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతుంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన అనూష మలేరియా, టైఫాయిడ్ డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని

టిడిపి నేతల నిరసన

వడ్డాదిలో నిరసన తెలుపుతున్న నేతలు

భీమిలిలో నిరసన తెలుపుతున్న నేతలు

విశాఖ కలెక్టరేట్ : జగన్‌కి అధికార మదంతో కళ్లు మూసుకుపోయాయని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ ఆదివారం సాయంత్రం జిల్లా టిడిపి కార్యాలయం వద్ద 'కళ్ల తెరిపిద్దాం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పిఎం పాలెం : చేయి చేయి కలుపుదాం నిజాన్ని గెలిపిద్దాం పేరిట తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన పిఎం.పాలెం రెండో బస్‌స్టాప్ వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, బాబ్జీ, రామకృష్ణ, తాడేల శ్రీను, బాషా, సుజాత, లక్ష్మి, చిన్నారావు, సూరి రెడ్డి పాల్గొన్నారు.

ఆనందపురం: తెలుగుదేశం, జనసేన ఆధ్వర్యాన మీసాల నాగేశ్వరరావు ఇంటి వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసాల సత్యనారాయణ, కొట్యాడ రమాదేవి, రెడ్డి బాబు, అప్పలస్వామి, రమణ, జయరామ్, పైడినాయుడు, వెంకటేష్, రాజేష్, అప్పలనాయుడు, శ్రీనివాస్, బంగారునాయుడు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యాన స్థానిక బీచ్‌లోని బుద్ధుని విగ్రహం వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటా నూకరాజు, పిట్ట సురేష్, పి.లక్ష్మీకుమారి, ఎస్.జోగారావు, కొక్కిరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: చంద్రబాబు అక్రమ అరెస్టులను నిరసిస్తూ 'కళ్లు తెరిపించాలి' కార్యక్రమాన్ని స్థానిక టిడిపి నేతలు, కార్యకర్తలు నిర్వహించారు. కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్‌రెడ్డి కక్ష సాధింపులో భాగంగానే చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అచ్యుతాపురం : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా హరిపాలెం గ్రామంలో ఎన్‌టిఆర్, గాంధీ విగ్రహాల ఆవరణలో ఆదివారం రాత్రి టిడిపి కళ్లు తెరిపించాలి కార్యక్రమంలో భాగంగా మాజీ సర్పంచ్ కాండ్రేగుల సూర్యనారాయణ, మాజీ ఎంపిటిసికాండ్రేగుల జోగినాయుడు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ కాండ్రేగుల బాబునాయుడు ఆధ్వర్యంలో కళ్ళకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సైకో పోవాలి సైకిల్ రావాలి అని నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో మారిశెట్టి అప్పలనాయుడు, కాండ్రేగుల వెంకటి, కాండ్రేగుల శ్రీహరి, ఎల్లపు రామకష్ణ పాల్గొన్నారు.

వడ్డాది: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టుని నిరసిస్తూ బుచ్చయ్యపేట మండలం వడ్డాది కొత్తూరులో ఆదివారం రాత్రి కళ్ళు తెరిపిద్దాం అనే కార్యక్రమం నిర్వహించారు. చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ బత్తుల తాతయ్య బాబు ఆధ్వర్యంలో వడ్డాది గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని కళ్ళు తెరిపిద్దాం నిజం నిరుపేదం అంటూ నినాదాలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తాతయ్య బాబు మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం ప్రజల నెత్తిన అప్పులు బారాన్ని మోపిందన్నారు. మళ్లీ జగన్ ప్రభుత్వం వస్తే రాబోయే తరాలకు కూడా ఈ అప్పులు నెత్తిన పడే అవకాశం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గుకివాడ కోటేశ్వరరావు, సిరిగిరి శెట్టి శ్రీరామమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ ఇన్‌ఛార్జి నానాజీ

బాధితులకు ఎంవిఆర్ సహాయం

ప్రజాశక్తి-గొలుగొండ: నిరాశ్రయులకు అండగా ఎం.వి.ఆర్ ట్రస్ట్ నిలుస్తుందని నియోజకవర్గ ఇన్చార్జి నానాజీ తెలిపారు. గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి నష్టపోయిన కుటుంబానికి ఎంవిఆర్ ట్రస్టు ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. అనకాపల్లి జిల్లాలో బాధిత ప్రజలను ఎం.వి.ఆర్ సంస్థ నుంచి ఆదుకుంటామన్నారు. ఇప్పటికే జిల్లాలో పలు సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా దేవాలయాలు అభివృద్ధి, అంబులెన్స్ ఏర్పాటు చేశామన్నారు. విద్యా వైద్య పరంగా అందుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ పి ఆర్ ఓ సతీష్ కుమార్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

మహా పడావ్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి:కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దింపాలని, బిజెపికి వత్తాసు పలుకుతున్న రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలను ఓడించాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. అనకాపల్లిలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక సంయుక్తాధ్వర్యంలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర రాజధానిలో నవంబర్ 27, 28 తేదీల్లో నిర్వహించే మహా పడావ్‌పై ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా పడావ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షకుల హక్కులను కాలరాసి కొంతమంది పెట్టుబడిదారులకు దేశ సంపదను కట్టబెట్టాలని చూస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని గద్దె దించకుంటే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేసి మనువాద రాజ్యాంగాన్ని అమలు పరిచే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ తెచ్చిన మూడు నల్ల రైతు వ్యతిరేక చట్టాలను, లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో 13 నెలలపాటు జరిగిన మహా పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ సమయంలో మోడీ ప్రభుత్వం దిగొచ్చి నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. అదే సమయంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన గిట్టుబాటు ధర చట్టం తెస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. 1995 నుంచి గిట్టుబాటు ధరలు లేకపోవడంతో మూడు లక్షల 65 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజలపై పన్నుల భారాలు మోపి తొమ్మిదిన్నర సంవత్సరాల్లో ఎనిమిది లక్షల కోట్ల రూపాయలను గుంజారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం రైతుల పక్షాన కాకుండా కార్పొరేట్ సంస్థలకు చెందిన రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాల రాస్తున్నారని, పత్రికా రంగంపై దాడులు నిర్వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో సహకార రంగంలో నడుస్తున్న నాలుగు సుగర్ ఫ్యాక్టరీల్లో మూడింటిని మూసివేయడం దారుణమన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై అందరికీ తెలియజేయాలన్నారు. తద్వారా రానున్న ఎన్నికల్లో బిజెపి, దాన్ని బలపరుస్తున్న పార్టీలను ఓడించాలన్నారు. ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం, ఏపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ఏపి చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ బాలు, రైతు సంఘం నాయకులు ఆర్.అప్పలరాజు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుద్ధి చేస్తున్న సిబ్బంది

తెరుచుకున్న వెంకన్న ఆలయం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయాన్ని శుద్ధిచేసి , సంప్రోక్షణతో ఆదివారం తెల్లవారుజామున తెరిచారు. పాక్షిక రాహుగ్రస్త చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు ఆలయాన్ని మూసివేసిన విషయం తెలిసిందే . ఆదివారం తెల్లవారుజామున ఆలయ సిబ్బంది ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేశారు.ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు ,కృష్ణమాచార్యులు, గోపాలాచార్యులు స్వామి సన్నిధిలో సంప్రోక్షణ చేశారు .విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనము నిర్వహించిన అనంతరం యధావిధిగా నిత్య పూజా కార్యక్రమాలు, భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :సిఎం రిలీఫ్ ఫండ్ నుండి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన గొర్లి శివాజీకు మాకవరపాలెం మండల నాయకుల సమక్షంలో చెక్కును అందజేశారు. శివాజీ అనారోగ్యానికి గురవడంతో ఎమ్మెల్యే ఉమా శంకర గణేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, ఆయన వెంటనే స్పందించి సీఎం సహాయనిధి నుండి రూ.2,00,000 అందజేయడం జరుగిందని కుటుంబ సభ్యులు తెలిపారు.శివాజీ తండ్రి అప్పారావు సిఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిందితునిపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:కోటవురట్ల మండలం కె వెంకటాపురం గ్రామంలో రెండు రోజుల క్రితం యువతిపై అత్యాచారానికి ప్రయత్నించిన తమరాన సత్యనారాయణ పై తగు చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఆదివారం డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు ఇదివరకే వెంకటాపురంలో జరిగాయని, దీంతో గ్రామాలలో మహిళలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. నిందితులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో సరైన శిక్షలు పడలేదన్నారు. బాలికలు, మహిళల హక్కుల రక్షణకు తీసుకొచ్చిన చట్టాల అమలులో ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా ఉండాలని మహిళల్లో ఆత్మస్థైరం పెంపొందించేందకు కరాటే వంటి శిక్షణలు ప్రభుత్వం పాఠశాల స్థాయిలో నేర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు యల్ గౌరి, ట్రెజరర్ కెవి సూర్యప్రభ, కె. ప్రసన్న, విజయ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు:మండల పరిధిలో అత్యధికంగా వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎస్సై కె.రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం పాడేరు నుండి ముంచింగిపుట్టు వెళ్లే ఆర్అండ్బి ప్రధాన రహదారిపై రేడియం స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎస్సై కె.రవీంద్ర మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు.

ఉన్నత చదువుతో గుర్తింపు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షి స్కూల్లో ఆదివారం ఆంధ్ర మెడికల్ కాలేజ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక వ్యక్తి ప్రముఖ చెవి, ముక్కు వైద్య నిపుణులు కె. సంతోష్ కుమార్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు సంతోష్ ఆంధ్ర మెడికల్ కాలేజ్ విశిష్టతను తెలిపారు. ఆంధ్ర మెడికల్ కాలేజీని 1923 జూలై 19న ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో ఎంతోమంది విద్యార్థులు వైద్య వృత్తిని చదివి ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఉన్నతమైన చదువులు చదివి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మిఠాయిలు పంపిణీచేస్తున్న వైద్యులు

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలో జోగుంపేట హైస్కూల్లో 1987- 1992 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ కలయిక ఏర్పాటు చేశారు. దూరమైన పూర్వ విద్యార్థులు తిరిగి తాము చదివిన హైస్కూల్లోనే కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.అప్పటిలో తమకు విద్యను అందించిన ఉపాధ్యాయులు ప్రకాష్ మాస్టార్ ని సత్కరించారు. అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ రోజంతా గడిపారు. పూర్వ విద్యార్థుల కలయికకు కృషిచేసిన అడిగర్ల వరహాల నాయుడు, జామి నానాజీ, సత్యనారాయణ, ధారబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. మరో కలయికలో కుటుంబ సమేతంగా కలుద్దాం అంటూ తీర్మానం చేసుకున్నారు.

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అరకులోయ:మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికయింది. జిల్లా గౌరవ అధ్యక్షులు టి చిట్టిబాబు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.దేముడు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల యూటీఎఫ్ నూతన గౌరవ అధ్యక్షులుగా టి.మోహన్ రావు, అధ్యక్షులుగా టి.విజయరావు, ఉపాధ్యక్షులుగా రవికుమార్, జి.సింహాద్రి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రామచందర్, కోశాధి కారిగా ఎం.నాగేశ్వరావు, కార్యదర్శులుగా చంద్రశేఖర్, వి.శాంతి, మచ్చులమ్మ, ఎల్వీ కామేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీగా ఎం.శ్రీను, కే.సుబ్బారావు, బి.ముక్తా, జి మహాలక్ష్మి, జిల్లా కౌన్సిలర్గా ఎన్.నారాయణ, ఎస్.రాజ్ కుమార్‌లు ఎన్నికయ్యారు. సలహాదారులుగా యు.గంగరాజు, ఎస్.దుక్కు నాయుడు, ఎరుకులు, చంద్రమోహన్‌దాస్, సిపిఎస్ కమిటీలు సభ్యులు ఎన్నికయ్యారు.

692వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి:తమకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేసారు.హెటిరో కొత్త పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహాధర్నా 692వ రోజుకు చేరింది. ఆదివారం ధర్నా శిబిరం వద్ద మత్స్యకారులు పైపులైనుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కొత్త పైపులైన్ వ్యతిరేకిస్తూ తామంతా 692 రోజుల నుండి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ, నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపక పోవడం దారుణమన్నారు. కంపెనీ వ్యర్ధ జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద వృద్ది చెందకపోవడంతో తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు.కంపెనీ ఏర్పాటు చేయకముందు వేటకు వెళితే సమృద్ధిగా చేపలు పడేవని, వాటితో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగించే వారమన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పైప్ లైన్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో మత్స్యకారులు జి.సోమేశ్వరరావు, సిహెచ్ సోమేష్, డి.నానాజీ, కె. భూలోక,కె.కాశీరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న మత్స్యకారులు

3వ వర్ధంతి

కీ॥శే॥ తోట కృష్ణమూర్తి గారు
జననం : 07-07-1946 మరణం : 30-10-2020
మమ్మల్ని ప్రయోజకుల్ని చేసి మాకు మధురస్మృతులను మిగిల్చి, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయినా.. నేటి నీ స్మృతి మమ్మల్ని ముందుకు నడిపిస్తూనే ఉంటుంది...
భార్య : తోట వరలక్ష్మి
కుమారులు : తోట నందేశ్వరరావు, మూర్తిపతిరావు (బాబ్జీ)
కుమార్తె : కంబాల అరుణకుమారి
కోడళ్ళు : తోట గీత, పూర్ణిమా
అల్లుడు : కంబాల సూరిబాబు
మనవళ్ళు : తోట హర్షవర్ధన్, కంబాల రవితేజ
మనవరాళ్ళు : తోట ఉషశ్రీ, దీప్తికశ్రీ, కంబాల భవ్యశ్రీ